వసతుల కల్పనకు ప్రథమ ప్రాధాన్యం

కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు



ఆల్విన్‌కాలనీ: ఆయా కాలనీల్లో వసతుల కల్పనకు ప్రథమ ప్రాధాన్యత ఇస్తున్నామని కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు అన్నారు. హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని ఆలీ తలాబ్ చెరువు వద్ద ఉన్న కట్ట మైసమ్మ ఆలయం వద్ద నెలకొన్న సమస్యలు, వాటి పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలు, చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై ఆలయ పరిసరాలను అధికారులతో కలిసి శుక్రవారం పరిశీలించారు.

అభివృద్ధి పనుల కోసం పరిశీలన



ఓల్డ్‌బోయిన్‌పల్లి: డివిజన్‌లో అంజయ్యనగర్, జయశంకర్‌నగర్, హస్మత్‌పేట, భవానీనగర్ ప్రాంతాల్లో డ్రైనేజీలు, మంచినీటి పైపులైన్లు, సీసీ రోడ్లు ఏర్పాటు కోసం శుక్రవారం వాటర్ వర్క్స్ మేనేజర్ తేజ వివిధ ప్రాంతాల్లో పర్యటించారు. అభివృద్ధి పనులను చేపట్టేలా ఎంపీ ఈటల రాజేందర్ జీహెచ్‌ఎంసీ అధికారులకు రూ.3.50 కోట్ల అభివృద్ధి పనుల కోసం ప్రపోజల్స్ పంపినట్లు బీజేపీ నాయకుడు తిరుపతి తెలిపారు. అధికారులు ఎస్టిమెట్ వేసిన అనంతరం ఎంపీ దగ్గర నుంచి నిధుల విడుదలకు కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు నర్సింగ్‌రావు, సాంబరావు, శేఖర్, రమేష్, మణి, అశోక్‌యాదవ్, దేవయ్య తదితరులు పాల్గొన్నారు.

చెత్తను పారిశుద్ధ్య కార్మికులకు అందజేయాలి

ఆల్విన్‌కాలనీ: చెత్తను ఎక్కడపడితే అక్కడ వేయొద్దని, పారిశుద్ధ్య కార్మికులకు అందజేయాలని యువ నేత దొడ్ల రామకృష్ణ అన్నారు. ఆల్విన్‌కాలనీ డివిజన్ పరిధిలోని ఎల్లమ్మబండ ప్రధాన రహదారిలో రోడ్లపై నిత్యం చెత్త వేయడంతో అక్కడ చెత్త పేరుకుపోయింది. గమనించిన ఆయన జీహెచ్‌ఎంసీ సిబ్బందికి రాత్రి సమయంలో సమాచారం అందించి తక్షణమే చెత్తను శుభ్రం చేయించారు.

కాంగ్రెస్ అరాచకాలకు ప్రజలు బలి

- పేదలకు అండగా బీఆర్‌ఎస్
- ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు



కార్పొరేటర్‌లతో సమీక్షా సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే కృష్ణారావు

కూకట్‌పల్లి: కాంగ్రెస్ నాయకుల అరాచకాలకు ప్రజలు బలి అవుతున్నారని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం నియోజకవర్గ కార్పొరేటర్లతో శుక్రవారం సమీక్షా పమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ నాయకుల వేధింపులకు గురవుతున్న పేదలకు అండగా ఉండాలన్నారు. బీఆర్‌ఎస్ పరిపాలనలో కేసీఆర్ నాయకత్వంలో ఎప్పుడు కూడా ఇలాంటి అరాచకాలు జరగలేదన్నారు. బీఆర్‌ఎస్ పార్టీ నిరుపేదలకు ఎప్పుడూ అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో కో ఆర్డినేటర్ సతీష్ అరోరా, కార్పొరేటర్‌లు ముద్దం నరసింహ యాదవ్, ఆవుల రవీందర్‌రెడ్డి, పండాల సతీష్‌గౌడ్, జూపల్లి సత్యనారాయణ, సబిహా బేగం, మహేశ్వరి శ్రీహరి, పగడాల శిరీష, శ్రీనివాసరావు, మాజీ కార్పొరేటర్‌లు పాల్గొన్నారు.

వేధింపులను తట్టుకోలేకనే ఆత్మహత్య

బీఆర్‌ఎస్ బోరబండ డివిజన్ మైనార్టీ సెల్ అధ్యక్షుడు సర్దార్ కాంగ్రెస్ కార్పొరేటర్ వేధింపుల వల్లే ఆత్మహత్య చేసుకున్నాడని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. శుక్రవారం క్యాంపు కార్యాలయంలో ఆయన మాట్లాడారు. కొన్ని నెలలుగా సర్దార్‌ని వివిధ రకాలుగా వేధిస్తున్నారని తెలిపారు. 15 రోజుల క్రితం ఇంటిని సైతం కూల్చి వేయించారని, అన్ని వైపుల నుంచి వేధింపులు ఎక్కువ కావడంతో ఆత్మహత్యకు పాల్పడ్డాడని ఆవేదన వ్యక్తం చేశారు. రెండున్నర ఏళ్ల వయస్సున్న పిల్లలు, భార్య అనాథలు అయ్యారన్నారు. అమాయక ప్రజలను వేధిస్తూ రాక్షసుల్లా పీడిస్తున్న ఇలాంటి నాయకులను క్షమించరాదన్నారు. వెంటనే ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రజలు కూడా వీరి అరాచకాలను గమనిస్తున్నారని, త్వరలోనే ఇటువంటి నాయకులకు ముగింపు పలికే రోజు వస్తుందని అన్నారు. బీఆర్‌ఎస్‌లో పది సంవత్సరాలు అధికారాలు అనుభవించి కాంగ్రెస్‌కు వెళ్లిన నాయకులే ఈ అరాచకాలు చేస్తున్నారని పీసీసీ అధ్యక్షులు గమనించాలన్నారు. ప్రజావాణిలో కాంగ్రెస్ నాయకులు బిల్డింగ్‌లపై ఫిర్యాదు చేయటం, బెదిరించి నిర్మాణదారుల వద్ద డబ్బులు దండుకోవడమేనా కాంగ్రెస్ అభివృద్ధి? అని ఆయన ప్రశ్నించారు. శేరిలింగంపల్లిలోని అయ్యప్ప సొసైటీలో ఎలాంటి పర్మిషన్లు లేకుండా బిల్డింగ్ నిర్మిస్తుంటే ఎందుకు కూల్చివేతలు చేపట్టలేదో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఫతేనగర్ బ్రిడ్జి కోసం నాటి మంత్రి కేటీఆర్ నిధులు కేటాయించి శంకుస్థాపన చేశారని గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోకపోవడం వల్లే ఇటీవల ఇద్దరు వక్తులకు తీవ్ర గాయాలయ్యాయన్నారు. ఫతేనగర్ బ్రిడ్జి, అండర్ పాస్ నిర్మాణం చేపట్టాలని, లేకపోతే బ్రిడ్జి వద్ద ధర్నా చేస్తామని హెచ్చరించారు.

వర్షాకాలం దృష్ట్యా అప్రమత్తంగా ఉండాలి

- పీఏసీ చైర్మన్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే గాంధీ
- అంబీర్ చెరువు ఔట్‌లెట్ స్థితిగతులను పరిశీలన



ఔట్‌లెట్ తూము స్థితిగతులను పరిశీలిస్తున్న పీఏసీ చైర్మన్ గాంధీ, బీఆర్‌ఎస్ విప్ వివేకానంద్

ఆల్విన్‌కాలనీ: వర్షాకాలం దృష్ట్యా అధికారులు అప్రమత్తంగా ఉండాలని పీఏసీ చైర్మన్ గాంధీ అన్నారు. హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని ప్రగతినగర్ అంబీర్ చెరువు ఔట్‌లెట్ తూము స్థితిగతులను కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే వివేకానంద్, కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావులతో కలిసి శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇటీవల కురిసిన వర్షాల కారణంగా అంబీర్ చెరువు పూర్తిగా నిండుకుండలా ఉందన్నారు. ఔట్‌లెట్ వద్ద పరిస్థితి, చెరువు కట్ట సామర్థ్యంను పరిశీలించామని తెలిపారు. ఔట్‌లెట్ ద్వారా వెలువడుతున్న నీటి ప్రవాహం ద్వారా చెరువు దిగువున గల కాలనీలోని లోతట్టు ప్రాంతాలు ముంపునకు గురికాకుండా ఇరిగేషన్ అధికారులు ముందస్తు తగు చర్యలు తీసుకోవాలన్నారు. తూమును ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ ఉండాలన్నారు. అంబీర్ చెరువు సుందరీకరణ, సంరక్షణ, అభివృద్ధి పనులు తుది దశలో ఉన్నాయన్నారు. అంబీర్ చెరువు చుట్టు ప్రక్కల ప్రజల విజ్ఞప్తి మేరకు గుర్రపుడెక్క తొలగింపు కార్యక్రమం చేపట్టామన్నారు. గుర్రపుడెక్క తొలగింపు పనులను వేగవంతంగా చేపట్టాలని సూచించారు. ప్రత్యేకంగా చెరువు చుట్టూ నిర్మించే మురుగునీటి కాలువ నిర్మాణ, అలుగు మరమ్మతులు, చెరువు కట్ట బలోపేతం, పునరుద్ధరణ పనులు, వాకింగ్ ట్రాక్ వంటి పనులు చేపడతామని పేర్కొన్నారు. చెరువు సంరక్షణలో భాగంగా చెరువు చుట్టూ ఫెన్సింగ్ నిర్మాణం, చెరువు అలుగు నిర్మాణం, చెరువు సుందరీకరణ పనులు చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో ఇరిగేషన్ అధికారులు డీఈ నరేందర్, ఏఈ లక్ష్మీ నారాయణ, నాయకుల రంగరాయ ప్రసాద్, ఎర్రగడ్డ శ్రీనివాస్ యాదవ్, దొడ్ల రామకృష్ణగౌడ్, ఎండీ ఇబ్రహీం, జిల్లా గణేష్, కాశీనాథ్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయ వార్షిక వేడుకలు

ఆల్విన్‌కాలనీ డివిజన్ పరిధి శివమ్మ కాలనీలోని శ్రీ రామాలయం నాలుగవ వార్షికోత్సవం శుక్రవారం జరిగింది. ఈ కార్యక్రమంలో పీఏసీ చైర్మన్, ఎమ్మెల్యే గాంధీ, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే వివేకానంద్ ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో నాయకులు ఎర్రగుడ్ల శ్రీనివాస్ యాదవ్, ఎండీ ఇబ్రహీం, రామకృష్ణగౌడ్, జిల్లా గణేష్, రాజేష్ చంద్ర, కాశీనాథ్, ఆలయ చైర్మన్ రామచందర్, కాలనీ అధ్యక్షులు కె. నరసింహులు, జి. కృష్ణ, అంజి పాల్గొన్నారు.

పరిశుభ్రత పాటిద్దాం.. దోమలను నివారిద్దాం!

దోమల నివారణపై అవగాహన ర్యాలీలు



బాలానగర్ డివిజన్‌లో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో కార్పొరేటర్ రవీందర్ రెడ్డి



ఆల్విన్‌కాలనీ డివిజన్‌లో .. కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ తదితరులు

కూకట్‌పల్లి: దోమల నివారణకు ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎంటమాలజీ అధికారులు, కార్పొరేటర్‌లు అన్నారు. నియోజకవర్గంలోని జంట సర్కిళ్ల పరిధిలో శుక్రవారం జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆదేశాల మేరకు దోమల నివారణ పట్ల అవగాహన ర్యాలీ కార్యక్రమాలను ఎంటమాలజీ అధికారులు, సిబ్బందితో నిర్వహించారు. ఆయా డివిజన్‌ల కార్పొరేటర్‌లు పాల్గొని దోమల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు కార్పొరేటర్‌లు, అధికారులు మాట్లాడుతూ.. గుంతల్లో, డ్రమ్ముల్లో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలన్నారు. నిల్వ ఉన్న నీటిలో లార్వా పెరిగి దోమల వ్యాప్తి జరిగి విష జ్వరాలు, డెంగీ, మలేరియా వంటి వ్యాధులు వ్యాపించే అవకాశం ఉందన్నారు. మన ఇంటి పరిసరాల్లో గుంతలు, పాత కూలర్స్, పూలకుండీలు, డ్రమ్ములు, టైర్లు, పగిలిపోయిన ప్లాస్టిక్ బకెట్లు, మట్టికుండలు, బిల్డింగ్‌పైన ఉండే సింటెక్సు, సిమెంటు గోళాలు వంటి వాటిలో నిల్వ ఉన్న నీటిని వారానికి ఒక్కసారైనా తొలగించాలన్నారు. ప్రతి శుక్రవారం డ్రై డేని పాటిస్తూ నీటి నిల్వలను తొలగించాలన్నారు. అదేశిధంగా ప్రతి ఇంటికి వెళ్లి నీటి నిల్వలను తనిఖీ చేసే ఎంటమాలజీ సిబ్బందికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో కార్పొరేటర్‌లు దొడ్ల వెంకటేష్ గౌడ్, సబిహా బేగం, ఆవుల రవీందర్ రెడ్డి, నార్నే శ్రీనివాసరావు, ఎంటమాలజీ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

వైద్యుల నిర్లక్ష్యం.. బాలింత కాళ్లకు గాయం!

పోలీసులకు ఫిర్యాదు చేసిన భర్త



మూసాపేట: వైద్యుల నిర్లక్ష్యం వల్ల బాలింత కాళ్లకు గాయమై నడవలేని స్థితిలో ఉన్న సంఘటన కూకట్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. నిర్మల్‌కు చెందిన సంధ్యారాణి, భర్త హర్షిత్ కుమార్ భార్యాభర్తలు. నిజాంపేటలో నివాసం ఉంటూ సంధ్యారాణి పంజాగుట్టలో డాక్టర్ జనరల్ ఫిజిషియన్‌గా చేస్తుంది. ఈ నెల 21న డెలివరీ కూకట్‌పల్లి, వివేకానందనగర్‌లోని అంకురా ఆసుపత్రిలో చేరింది. 22న కవల పిల్లలకు జన్మనిచ్చింది. హ్యాండ్ గ్లౌస్‌లో వేడినీరు పోసి తాపడం పెడుతూ అక్కడే మర్చిపోయి బయటకు వెళ్లిపోయారు. అనస్తీషియాలో ఉన్న బాలింత స్పృహలోకి వస్తూ నొప్పి రావడంతో అరవగా వెంటనే సిబ్బంది వచ్చి తొలగించారు. అప్పటికే సుమారు 15 నిమిషాల పాటు అలాగే ఉండటంతో రెండు కాళ్లు బొబ్బలు వచ్చి కమిలిపోయాయి. ఆమె నడవలేక పోతుండటంతో కూకట్‌పల్లి పోలీస్ స్టేషన్‌లో ఆమె భర్త హర్షిత్‌కుమార్ ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉచిత వైద్య శిబిరం అభినందనీయం



వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే శ్రీగణేష్ తదితరులు

ఓల్డ్ బోయిన్‌పల్లి: ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేయడం అభినందనీయమని కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్, కాంగ్రెస్ పార్టీ మల్కాజిగిరి పార్లమెంట్ ఇన్‌చార్జి పట్నం సునీత మహేందర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఓల్డ్ బోయిన్‌పల్లి డివిజన్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు వేంకటేశ్ ఆధ్వర్యంలో మల్లికార్జుననగర్ భాగ్యశ్రీ ఫంక్షన్ హాల్‌లో మెడిక్యూర్, వాసన్ ఐ కేర్ వైద్యుల సహకారంతో ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఆ శిబిరానికి వారు ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. బీపీ, షుగర్, కంటి పరీక్షలు, ఈసీజీ, ఊపిరితిత్తులు, సాధారణ పరీక్షలు, ఎముకల పరీక్షలు, గర్భిణులకు పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులను అందజేశారు. అదేవిధంగా అవసరమైన వారికి కంటి ఆపరేషన్ల కోసం ఆసుపత్రికి రావాలని సూచించారు. 300 మందికి పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో టీపీసీసీ కార్యదర్శి దండుగుల యాదగిరి, కాంగ్రెస్ పార్టీ డివిజన్ అధ్యక్షుడు మల్లికార్జునయాదవ్, శివచరణ్‌రెడ్డి, కిరణ్‌గౌడ్, అరవింద్ కిషోర్ నాయుడు, అరవింద్‌గౌడ్, పవన్ కుమార్, శేఖర్, తరుణ్, అరుణ్, షాయిన్‌షా, మహేందర్, విజయలక్ష్మి, మనిషా, సల్మా తదితరులు పాల్గొన్నారు.